
క్లుప్తంగా

నిరసనకు తరలిరండి : తన్నీరు



జగ్గయ్యపేటఅర్బన్: రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలోని కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించే నిరసన కార్యక్రమానికి రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని వైఎస్సార్ సీపీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చేపడుతున్న ఈ నిరసనకు అందరూ హాజరుకావాలని కోరారు. పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం, ఉచిత పంటల బీమాను ఎత్తివేయడం తదితర చర్యల ద్వారా కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తోందన్నారు. ఉదయం 9 గంటలకు విజయవాడలోని మ్యూజియం రోడ్‌లోని రమా క్లాత్ స్టోర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా అమ్మవారి శాంతి కల్యాణం



పెనుగంచిప్రోలు: హిందూ ధర్మప్రచారంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణంలోని వరప్రదాత షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం పెనుగంచిప్రోలు శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి శాంతికల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణమూర్తుల ప్రచారరథానికి భక్తులు ఎదురేగి కోలాట నృత్యాలు, పూలతో స్వాగతం పలికారు. కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో షిర్డీ సాయి మందిరం చైర్మన్ డాక్టర్ వేములపల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు కల్లూరి శ్రీవాణి, వేదపండితులు రామడుగు నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో కార్మికుల తొలగింపు తగదు



వత్సవాయి : మండల కేంద్రం వత్సవాయి జెడ్పీ పాఠశాల మధ్యాహ్నభోజన పథకం కార్మికులుగా 25ఏళ్లుగా పనిచేస్తున్న వారిని కేవలం రాజకీయ క్షక్షతోనే తొలగించడం తగదని సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము విమర్శించారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులతో కలిసి గురువారం ఆయన ఎంఈవో ఎల్.నాగరాజుకు ఓ వినతి పత్రం అందజేశారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులను కొనసాగించాలని కోరారు. అనంతరం రాము మాట్లాడుతూ 25ఏళ్లగా పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం కార్మికులుగా పనిచేస్తున్న చంద్రగిరి లక్ష్మీనారాయణ, సరస్వతి, నరసమ్మ, చల్లా నాగమణిలను అకారణంగా తొలగించారని మండిపడ్డారు. అధికారపార్టీ నాయకులు మా ప్రభుత్వం వచ్చింది. మీరు తప్పుకోండి మా వాళ్లను పెట్టుకుంటాం అని పేర్కొంటూ చివరికి అన్నంతపని చేశారన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి తొలగించినవారిని తిరిగి పనిలో పెట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

నిర్లక్ష్యం నీడలో బాలుర హాస్టల్

- శిథిలావస్థలో భవనం
- భయంతో హాస్టల్‌లో చేరని విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో పేద విద్యార్థులు



శిథిలావస్థలో పెనుగంచిప్రోలు ఎస్సీ బాలుర వసతి గృహం



తాగునీటి సదుపాయం లేక డమ్మీ చేసిన కొళాయిలు

పెనుగంచిప్రోలు: సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగాపెనుగంచిప్రోలులోని ఎస్సీ(బాలుర)వసతి గృహం నిరుపయోగంగా మారింది. గ్రామాల్లో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించటంతోపాటు వారి భవిష్యత్‌కు తోడ్పాటు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ హాస్టల్‌లోని కొన్ని గదులు శిథిలావస్థకు చేరడంతో ఇక్కడ చేరేందుకు విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారు. దీంతో అడ్మిషన్లు లేక హాస్టల్‌ను పూర్తిగా మూసివేశారు. హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేపట్టి, వాటిని వినియోగంలోకి తీసుకురావడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన సాంఘిక సంక్షేమశాఖ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోకపోవడమే ఈ దుస్థితికి కారణమని గతంలో ఈ హాస్టల్‌లో ఉండి చదువుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పట్టించుకున్న వారేరి..

ఈహాస్టల్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆయా హాస్టల్ గదులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రెండేళ్లుగా విద్యార్థులు చేరలేదనే విమర్శలు వినిపిస్తున్నారు. దీంతో ఈ హాస్టల్ మూతపడింది. ఇక్కడ ఉన్న వార్డెన్‌ను జగ్గయ్యపేట ఏఎస్‌డబ్ల్యూ కార్యాలయంలో విధులకు వినియోగిస్తున్నారు. వంటమనిషిని జగ్గయ్యపేట హాస్టల్‌కు, వాచ్‌మెన్‌ను గంపలగూడెం హాస్టల్‌కు పంపించారు. ఓ వర్కర్ మాత్రం హాస్టల్‌కు రోజూ వచ్చి పరిశుభ్రంగా ఉంచేందుకు పిచ్చిమొక్కలు తొలగించడం, శుభ్రం చేయటం చేస్తున్నాడు.

పునఃప్రారంభిస్తే విద్యార్థులకు మేలు..

హాస్టల్ వంటశాల భవనం బాగానే ఉంది. సుమారుగా 40నుంచి 50మంది విద్యార్థులు ఉండేందుకు వీలుంది. హాస్టల్‌ను పునఃప్రారంభిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. హాస్టల్ మూసివేతతో స్థానికంగా విద్యనభ్యసించే విద్యార్థులకు వసతి అందుబాటులో లేక ఇతర ప్రాంతాల హాస్టల్‌కు వెళ్లగా, హాస్టల్ వసతి లేని కారణంగా పలువురు విద్యకు దూరమైన పరిస్థితి నెలకొంది హాస్టల్ హాస్టల్ భవన మరమ్మతులకు రూ.11.78లక్షలు మంజూరైనట్లు వార్డెన్ ఎం.ఆంజనేయస్వామి తెలుపగా, భవనం శ్లాబ్ మొత్తం తీసి కొత్త శ్లాబ్ వేయటానికి ఈ నిధులు ఏమాత్రం సరిపోవనే వ్యాఖ్యలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. మంజూరైన నిధులతో మరుగుదొడ్లు, బోరు, రన్నింగ్ వాటర్, ఎలక్ట్రిఫికేషన్ వంటి సదుపాయాలు కల్పించి హాస్టల్‌ను పునఃప్రారంభిస్తే విద్యార్థులకు మేలు చేకూరుతుందంటున్నారు. ఇకనైనా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు స్పందించి హాస్టల్‌కు నూతన భవనాన్ని నిర్మించేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్తిగా శిథిలమైన భవనం...



పెచ్చులూడుతున్న భవనం శ్లాబ్

వసతి గృహం భవనంలో మొత్తం 12గదులు ఉన్నాయి.చుట్టూ ప్రహరీ, విశాలమైన స్థలం ఉంది. ఇక్కడ ఆయా గ్రామాలకు చెందిన మూడు నుంచి ఎనిమిదోతరగతి వరకు చదివే 100మంది విద్యార్థులు ఉండేవారు. కాని కాలక్రమంలో వసతి గృహంలో సమస్యలు పెరగడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. భవనం మొత్తం శిథిలమై శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. దీంతో గతేడాది నుంచి అడ్మిషన్లు కూడా లేని పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థులు ఎవరూ ఉండే పరిస్థితి లేదు. అలాగే ప్రధానంగా బోరు లేక పోవడంతో నీటి సమస్య నెలకొంది. మరుగుదొడ్లు కూడా పూర్తిగా పాడయ్యాయి. సెప్టిక్ ట్యాంక్ మార్చటంతో పాటు ఎలక్ట్రిఫికేషన్ మరమ్మతులు చేయాల్సి ఉంది.

పట్టాలు ఇవ్వాలని వినతి



నందిగామటౌన్: కొండ పోరంబోకు భూములను పదిహేనేళ్లుగా సాగుచేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని రాఘవాపురం సర్పంచ్ పెసరమల్లి సురేష్, సీపీఎం నాయకుడు కటారపు గోపాల్ కోరారు. రాఘవాపురంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కొండ పోరంబోకు పొలాన్ని సాగుచేసుకుంటున్న బడుగు, బలహీనవర్గాలకు చెందిన 55మంది రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ వారువినతిపత్రం అందజేశారు. భూసంబంధిత సమస్యల పరిష్కారం కోరుతూగ్రామస్తులు వీఆర్వో పరమేశ్వరరావుకు 14అర్జీలు అందజేశారు.

వాహనాల తనిఖీ



నందిగామటౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని నందిగామ సీఐ వైవిఎల్ నాయుడు హెచ్చరించారు. పట్టణంలోని సీఎం రోడ్డులో బుధవారం అర్ధరాత్రి బ్రీత్ ఎనలైజర్స్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెచ్చిపోతున్న దొంగలు

బెంబేలెత్తుతున్న ప్రజలు



మెడలో గొలుసు అపహరణ ఘటనను వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావుకు వివరిస్తున్న బాధితులు (ఫైల్)

వత్సవాయి: దొంగలు రెచ్చిపోతున్నారు. దొంగలు అంటే గతంలో రాత్రి సమయాల్లోనే దొంగతనాలు చేసేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పట్టపగలే దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. జగ్గయ్యపేటగ నియోజకవర్గంలో గత రెండు నెలల్లో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నగదు, బంగారంతో పాటు వ్యవసాయ మోటార్లు, ఆరుబయట ఉన్న మేకలు, గొర్రెలను సైతం దొంగలు అపహరించుకుపోతున్నారు.

పగటి పూట రెక్కీ....

దొంగలు ఆయా గ్రామాల్లో పగటి సమయాల్లో వీధుల వెంట తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తున్నారు. గ్యాస్‌స్టవ్ రిపేర్ చేస్తాం, బ్యాగులకు జిప్పులు వేస్తాం, పాత సెల్‌ఫోన్లకు స్టీల్ సామాన్లు ఇస్తాం అంటూ గ్రామాల్లో సంచరిస్తూ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. పరిసరాలపై అవగాహన పెంచుకుని రాత్రివేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇలా గడచిన రెండు నెలల్లో వరుసగా దొంగతనాలు జరుగుతుండటంతో జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఆయా చోరీ ఘటనల వివరాలు..

- సెప్టెంబర్ నెల 15వతేదీ వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన దంపతులు ద్విచక్రవాహనంపై జగ్గయ్యపేట వెళ్తుండగా గుర్తు తెలియని మార్గమధ్యలో బైక్‌పై వచ్చి అటకాయించి మహిళ మెడలోని 20 గ్రాముల బంగారు గొలుసు అపహరించారు.
- అక్టోబర్ నెలలో వత్సవాయి, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలాల్లోని కంభంపాడు, పెనుగంచిప్రోలు, గౌరవరం గ్రామాల్లో రాత్రి సమయాల్లో ఆరుబయట ఉన్న గొర్రెలు ఎత్తుకెళ్లారు.
- నవంబర్‌లో జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు సమీపంలో ఒక సిమెంట్ కర్మాగారంలో బైక్‌లు అపహరణకు గురయ్యాయి. అదే నెల 21న చిల్లకల్లులోని మరో ఇంటిలో సుమారు 200 గ్రాముల బంగారం, కేజీపైనే వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి.
- నవంబర్ 25న వత్సవాయి మండలం మక్కపేటలో పగలే ఒక ఇంటిలో సుమారు రూ.3లక్షల విలువైన కెమెరా, మరో ఇంటిలో బంగారం చెవిదిద్దులు, ఉంగరాలు, వెండి పట్టీలను దొంగలు ఎత్తుకెళ్లారు.
- డిసెంబర్ 9న వత్సవాయి మండలం దబ్బాకుపల్లిలో మధ్యాహ్న సమయంలో కుమార్తె వివాహం కోసం దాచి ఉంచిన రూ.36లక్షలను అగంతకులు చోరీ చేశారు. ఇలా గత మూడునెలలుగా నియోజకవర్గంలో చోటుచేసుకున్న వరుస దొంగతనాలు జనాలను భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి దొంగతనాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ పహారా నిర్వహిస్తున్నాం..

విహారయాత్రలు, ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ప్రజలు కూడా పలు జాగ్రత్తలు పాటించాలి. ఇంటిలో విలువైన నగలు, నగదు ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి. ఎక్కువ రోజులు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఆ సమాచారాన్ని పోలీసులకు చెబితే మంచిది. రాత్రి సమయాల్లో గస్తీలు నిర్వహించే పోలీసులు సదరు ఇళ్లను గమనిస్తూ ఉంటారు. దొంగతనాలను అరికట్టేందుకు టెక్నాలజీలో భాగంగా ఈ పహారా నిర్వహిస్తున్నాం. రాత్రి తొమ్మిది గంటలనుండి ఉదయం ఏడు గంటల వరకు జియో ట్యాగింగ్ ద్వారా బీట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ బీట్ల పర్యవేక్షణలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు కూడా ఉంటారు. అనుమానితులపై నిఘా ఉంచుతున్నాం. తొందరలోనే ఆయా చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకుంటాం.

–పి వెంకటేశ్వర్లు, సీఐ, జగ్గయ్యపేట

రెవెన్యూ సదస్సుకు 61 అర్జీలు



నవాబుపేటలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శాంతిలక్ష్మి

తిరుమలగిరి(జగ్గయ్యపేట): మండలంలోని తిరుమలగిరి సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసంబంధిత సమస్యల పరిష్కారం కోరుతూ 26మంది రైతులు అర్జీలు అందజేసినట్లు ఆర్ఐ సూరమ్మ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో గోవిందరాజు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

నవాబుపేట(పెనుగంచిప్రోలు): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకుని భూసంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలకు ఈసదస్సుల ద్వారా పరిష్కారం దొరుకుతుందన్నారు. రైతుల నుంచి 25 అర్జీలు అందినట్లుత వివరించారు. కార్యక్రమంలో డీటీ భాస్కర్, వీఆర్ఓ చైతన్య, రైతులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కీసర(కంచికచర్ల): రైతుల భూవివాదాలకు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి పేర్కొన్నారు. మండలంలోని కీసర గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదార్ పాసుపుస్తకాల మంజూరు, భూముల కొలతలు, హద్దులు తేడాలను సరిచేయాలని కోరుతూ రైతుల నుంచి పది అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి పేరం వెంకటనర్సమ్మ, ఆర్ఐ వెంకట్, వీఆర్వో హసీనాబేగం, రైతులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఇబ్బంది లేకుండా చూడాలి : డీటీవో



మాట్లాడుతున్న డీటీవో రవి, వేదికపై పెన్షనర్ల సంఘ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల విషయంలో ట్రెజరరీ అధికారులు, సిబ్బంది గౌరవంగా మెలుగుతూ ఆత్మీయతాభావంతో వారికి అన్నివిధాలుగా సహకరించాలని జిల్లా ట్రెజరీ అండ్ ఆడిట్ ఆఫీసర్ ఎ.రవి సూచించారు. స్థానిక ఉక్కు కళావేదికలో గురువారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్టీవో ప్రఫుల్లకుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా హాజరైన రవి హాజరై ప్రసంగించారు. పెన్షనర్లు సకాలంలో పెన్షన్లు అందుకునే విధానం, హెల్త్‌కార్డులుపై, ఆరోగ్య సహాయ సహకారాల గురించి పెన్షనర్లు జిల్లా ట్రెజరీ అధికారితో చర్చించారు. పెన్షనర్లు ఎదుర్కొనే సమస్యలపై అభిప్రాయాలు, పరిష్కార విధానాలపై చర్చించారు. స్థానిక ఉప ఖజానా కార్యాలయం పనితీరును, సిబ్బంది పెన్షనర్ల పట్ల వ్యవహరిస్తున్న తీరు, సహకారాలు అందించడంపై ప్రశంసలు వ్యక్తం చేశారు. స్థానిక ఎస్టీవో కార్యాలయంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని పెన్షనర్లు, డీటీవో రవిని కోరారు. అనంతరం ఏపి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులంతా కలిసి డీటీవోను సన్మానించారు. కార్యక్రమంలో నందిగామ, విజయవాడ ఎస్టీవోలు నాగేశ్వరరావు, సతీష్, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాదిరాజు కేశవరావు, షేక్ అబ్బాస్ ఆలీ, ఉపాధ్యక్షులు చావా ప్రేమ్‌చంద్, కొండా, కోశాధికారి శంకరరావు, రిటైర్డ్ ఎస్టీవో వాహెద్, పెన్షనర్ల భవన్‌లోని ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు ధరణికోట వెంకటరమణ, యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ధార వినోద్‌బాబు, తిరుపతయ్య, ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, మరియదాసు, ట్రెజరర్ ముత్యాలరావు, పెన్షనర్లు, ఎస్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

పెనుగంచిప్రోలు: వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధం ఆధ్వర్యంలో స్థానిక మునేరు అవతల మామిడి తోటలో గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవడంతోపాటు వేతన బకాయిలు చెల్లించాలన్నారు. రూ.10వేల వేతనం హామీని అమలుచేయాలని కోరారు. డిగ్రీ చదివిన వారు కూడా వలంటీర్లుగా కేవలం రూ.5 వేల గౌరవ వేతనానికి పనిచేయటానికి సిద్ధపడ్డారంటే నిరుద్యోగ సమస్య ఏస్థాయిలో ఉందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం వలంటీర్ల మండల శాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎం.శివగోపి, పూర్ణ, టి.అశోక్, కార్యదర్శిగా పి.త్రివేణి, సహాయ కార్యదర్శిగా జి.క్రాంతికుమారి, కోశాధికారిగా పి.భవానిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నందిగామటౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆమె 25 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 20.56 లక్షలను పంపిణీ చేశారు. విప్ సౌమ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజాసంక్షేమాన్ని మాత్రం విస్మరించడం లేదని వివరించారు.

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలి

జగ్గయ్యపేట అర్బన్: పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రోడ్ల మార్జిన్ల వద్ద ఉన్న ఆక్రమణలను ఆయా దుకాణాదారులు స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు సూచించారు. స్థానిక కోదాడ రోడ్, విజయవాడ రోడ్, బలుసుపాడు రోడ్, ముక్త్యాల రోడ్ తదితర అన్ని ప్రధాన రోడ్లు, కూడళ్లలోని ఆక్రమణలు, డివైడర్లు, అనధికార ఫ్లెక్సీలను ఈనెల 14 వ తేదీలోగా స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. స్వచ్ఛందంగా తొలగించకపోతే మున్సిపల్, ట్రాఫిక్ సిబ్బంది ఆయా ఆక్రమణలను తొలగించడంతోపాటు సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 5వవార్డులో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను కౌన్సిలర్ వట్టెం మనోహర్ గురువారం పరిశీలించారు. గతంలో నిర్మించిన డ్రైనేజీలో కొంతభాగం పాక్షికంగా దెబ్బతినడంతో సమస్యను కౌన్సిలర్ మనోహర్ కౌన్సిల్ సమావేశం దృష్టికి తెచ్చారు. డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టాలని కోరడంతో మున్సిపల్ అధికారులు పనులు చేపట్టారు. ఈ పనులను మనోహర్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కలీముల్లా, ఏఈ అహ్మద్, 2 వ వార్డు సచివాలయం సెక్రటరీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు ఇవ్వాలంటూ వినతిపత్రం అందజేత



తిమ్మాపురంలో తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

వీరులపాడు: ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నందున తమకు నివేశన స్థలాలు అందించాలని తిమ్మాపురం గ్రామస్తులు, తహసీల్‌ద్రాస్‌ను కోరారు. మండలంలోని తిమ్మాపురంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని 30కుటుంబాలవారు తమ సమస్యలను తహసీల్దార్ హుస్సేన్‌కు వివరించారు. ఇళ్లస్థలాలను కేటాయించాలంటూ వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ సంధ్య, వీఆర్వో వెంకటేశ్వరరావు, రైతులు, గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి విశేష పూజలు చేశారు. నదీ జలాలతో అభిషేకాలు, పవిత్రారోహణ, ప్రధాన హోమాలతో పాటు స్వామివారి శాంతి కళ్యాణం, మహాశాంతి హోమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి పాదుకలను ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ వరప్రసాద్, చక్రపాణి, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ



గంప్రాయి(జగ్గయ్యపేట): స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గరికపాడు కెవీకె ఆధ్వర్యంలో మహిళలకు హెర్బల్ పౌడర్ తయారీపై గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. కెవీకె గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి మాట్లాడుతూ మహిళలు ఇళ్లకే పరిమితం కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన కలిగి ఉండాలన్నారు.సర్పంచ్ లూర్దుమేరీ, సూపర్‌వైజర్ శారద, మహిళలు పాల్గొన్నారు.